సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



క్లెయిములు పరిష్కరిస్తాం

ఓటరు జాబితాలో సవరణలు 26 నాటికి పరిష్కరిస్తామని డీఆర్‌ఓ తెలిపారు. పలు పార్టీల నాయకులతో ఆయన మాట్లాడారు. - 8లో



క్రిస్మస్ సందడి

జిల్లాలో క్రిస్మస్ సందడి మొదలైంది. మార్కెట్‌లో కూడా క్రిస్మస్ సామగ్రి సిద్ధమైంది. - 8లో

అంగన్‌వాడీ కేంద్రాల్లో సరుకుల పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వ ఉన్న పౌష్టికాహారం సరుకులను సంబంధిత లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ సీడీపీఓ పురాణం నాగరాణి తెలిపారు. కేశుపురం పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సచివాలయం సిబ్బందితో తెరిపించి చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించిన సరుకుల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.

న్యూస్‌రీల్

నేడు ఐటీఈపీ కోర్సులో తక్షణ ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది ప్రారంభించిన ఐటీఈపీ కోర్సు (నాలుగేళ్ల సమీకృత డిగ్రీ) లో శుక్రవారం తక్షణ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు అడ్మిషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. వర్సిటీలో గురువారం వివరాలు వెల్లడించారు. ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఏ+బీఎడ్, బీఎస్సీ+బీఎడ్ కోర్సుపై ఆసక్తి ఉండి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన కామన్ ఎంట్రన్స్‌టెస్ట్‌లో అర్హత మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, టెస్టు అర్హత ధ్రువీకరణ పత్రం తప్పనిసరని తెలిపారు. బీఎస్సీకి రూ. 18000, బీఏకి రూ.15000 ఫీజు స్ట్రక్చర్‌గా తెలిపారు. స్పాట్ అడ్మిషన్ విద్యార్థులకు ఎలాంటి ఫీజు రాయితీలు వర్తించబోవని స్పష్టం చేశారు.

వాసుదేవుని సన్నిధిలో పాశుర పఠనం



వాసుదేవుని సన్నిధిలో తిరుప్పావై పాశురాలను పఠిస్తున్న దృశ్యం

మందస: మందసలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో ధనుర్మాసం పూజలు కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారన్నారు. ఆండాళ్ల గోష్ఠి, భక్తులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారదర్శనం కల్పిస్తున్నట్టు ప్రధాన అర్చకులు దాసుకూర్మాచార్యులు చెప్పారు. భోగి పండగ రోజున గోదాదేవి, రంగనాథుల కల్యాణంతో పూజలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి అత్యవసర శస్త్రచికిత్స

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ప్రీ యూనివర్సిటీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జాస్మిన్‌కు శ్రీకాకుళం రిమ్స్‌లో గురువారం గురువారం అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించారు. విద్యార్థినికి భరించలేనంతగా కడుపు నొప్పి రావడంతో స్థానిక విద్యాసంస్థ అంబులెన్స్‌లో రిమ్స్‌కు తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అపెండిసైటిస్‌గా గుర్తించి అత్యవసర శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. దీంతో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణ రిమ్స్ సూపరింటెండెంట్ స్వామినాయుడుతో మాట్లాడారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రుల దృష్టికి సమస్య తీసుకువెళ్లి, శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్ర చికిత్స విజయవంతమై ఆస్పత్రిలో విద్యార్థిని విశ్రాంతి తీసుకుంటోంది. ట్రిపుల్ ఐటీ వసతి గృహాల్లో నిరంతరం విద్యార్థులకు సిబ్బంది అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంబులెన్స్, వైద్య సిబ్బందిని సైతం అందుబాటులో ఉంచుతున్నారు.

వృత్తి మెకానిక్... చేసేది చైన్‌స్నాచింగ్

అల్లిపురం: మోటారు సైకిళ్లు దొంగతనం చేసి... వాటి నంబర్ ప్లేట్లు మార్చి... ఆ బైక్‌లపై వెళ్తూ మహిళల మెడలోని బంగారు చైన్లు తెంపుకుపోతున్న బైక్ మెకానిక్ భీమరశెట్టి కమల్‌నాథ్ అలియాస్ ఆర్కేను ఆరిలోవ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి 4 బైక్‌లు, 4 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై శ్రీకాకుళం జిల్లాలోనూ రెండు కేసులు నమోదై ఉన్నాయి. ఈ మేరకు నగర క్రైం ఏడీసీపీ డి.గంగాధరం విలేకరులకు గురువారం వివరాలు వెల్లడించారు. కేఆర్ఎం కాలనీకి చెందిన గుత్తుల లలిత భర్త, కూతురు ఒక బైక్ పైన, తల్లితో కలిసి ఆమె ఒక స్కూటీపై ఈ నెల 9న ఉదయం అడివి వరం కాలభైరవ స్వామి గుడికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పెదగదిలి సాయిబాబా గుడి వద్దకు వచ్చే సమయంలో వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలోని నల్లపూసల దండ తెంపుకుని వెళ్లిపోయాడు. దీంతో ఆమె తన భర్తతో కలిసి ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు దర్యాప్తు చేసి నిందితుడిని పట్టుకున్నారు.ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద పార్కు చేసిన బైక్‌ను అపహరించి చైన్‌స్నాచింగ్‌కు వినియోగించాడు. ఆ బైక్ నంబర్ ప్లేట్ తొలగించి, తాను నివసిస్తున్న సుభాష్‌నగర్‌లోని ఓ వ్యక్తి బైక్ నంబరు తగిలించి చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడని తెలిపారు.



ఆమదాలవలస: పేదలకు వస్త్ర దానం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కాశీబుగ్గ: ముఖ్య నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తదితరులు



రణస్థలం: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్



సోంపేట: సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ



టెక్కలి: రక్తదానం చేసిన యువతకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి



కొత్తూరులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ నేతలు

సంక్షేమ సామ్రాట్‌కు సేవాభినందనలు

అందరి ఆకాంక్ష ఒక్కటే.. వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలి. అందరి ఆశీర్వాదం ఒక్కటే.. సంక్షేమ ప్రదాత ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలి. అభిమాన నాయకుడిపై ఉన్న ప్రేమను వైఎస్సార్ సీపీ నాయకులు అపురూప రీతిలో చూపించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఊరూవాడా అన్నదానాలు, వస్త్రదానాలు నిర్వహించారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. బైక్ ర్యాలీలు, ప్రత్యేక కార్యక్రమాలతో హోరెత్తించారు. చరిత్ర ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న వైఎస్ జగన్‌కు దేవుడి దీవెనలు ఉండాలంటూ పూజలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్

- ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం వివిధ సేవా కార్యక్రమాలకు హాజరయ్యారు.
- శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరయ్యారు. నగరంలో వివిధ సేవా కార్యక్రమాలు జరిగాయి.
- పలాసలో మంత్రి సీదిరి అప్పలరాజు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
- వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించి కేక్‌కట్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, నాయకులు హాజరయ్యారు.



నందిగాం: కేక్‌ను కట్ చేసిన పేరాడ తిలక్, కిల్లి కృపారాణి

- శ్రీకాకుళం నగరంలో రామలక్ష్మణ కూడలిలోని దుర్గమ్మవారి ఆలయంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో వారాహిదేవి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- టౌన్‌హాల్ పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం జరిగింది.
- పాతపట్నం నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరయ్యారు.
- ఎచ్చెర్ల నియోజకవర్గంలో నిర్వహించిన వివిధ సేవాకార్యక్రమాల్లో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.
- టెక్కలి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ సమన్వయ కర్త వాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు వివిధ సేవాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గెలుపును కానుకగా ఇద్దాం

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకునేందుకు అంతా కార్యోన్ముఖులు కావాలి. రానున్న వంద రోజులు పార్టీ కోసం కష్టపడాలి. జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాలను గెలిచి సీఎంకు కానుకగా ఇవ్వాలి. టీడీపీ, జనసేన కూటమిని తిప్పి కొట్టాలి. ప్రజలకు వైఎస్ జగన్ అవసరాన్ని ఊరూరా తిరిగి చెప్పాలి.

– నరసన్నపేటలో జరిగిన సీఎం పుట్టిన రోజు వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

కొలువు కుదిరింది

- ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో జిల్లా వాసుల ప్రతిభ

ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో జిల్లా వాసులు ప్రతిభ చూపించారు. పట్టుదలతో చదివి అనుకున్న కొలువును కొట్టారు. వీరిలో కొందరిది నిరుపేద నేపథ్యం కాగా.. మరి కొందరు ఒక ఉద్యోగంలో ఉంటూనే ఈ ఉన్నత ఉద్యోగాన్ని సాధించారు.

పట్టుదలతో చదివి..



మధుసూదనరావు



మణికంఠ

నరసన్నపేట, శ్రీకాకుళం రూరల్: మండలంలోని కిళ్లాంకు చెందిన కొత్తంటి మధుసూదనరావ ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యారు. ఇప్పటికే ఆయన తెలంగాణ రాష్ట్రంలో కానిస్టేబుల్‌గా కూడా ఎంపికయ్యారు. 23 సంవత్సరాల మధుసూదనరావుకు తండ్రి లేరు. చిన్నప్పుడే తండ్రి చనిపోగా తల్లి శాంతమ్మ రెక్కల కష్టంతో మధుసూదనరావు సోదరులు పెరిగి పెద్దయ్యారు. మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో టెన్త్ పూర్తి చేసిన మధుసూదనరావు ఇంటర్ నరసన్నపేటలో ఒక ప్రైవేటు కళాశాల్లో పూర్తి చేశా రు. డిగ్రీ శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో చదివారు. ఈయన అన్న నవీన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మధుసూదనరావు తల్లికి సహాయం చేస్తూ కూలి పనులకు కూడా వెళ్లారు. ఫొటోగ్రాఫర్‌గానూ పనిచేశారు. గ్రామ యువకులు నిర్వహిస్తున్న లైబ్రరీలోనే పుస్తకాలను చదువుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. మధుసూదనరావు ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక కావడంపై ఊరివారంతా సంబర పడుతున్నారు. పట్టుదలతో చదవడంతో ఉద్యోగాన్ని సాధించగలిగానని ఆయన తెలిపారు.

అగ్నిమాపక కానిస్టేబుల్..

స్థానిక అగ్నిమాపక కేంద్రంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఊణ్ణ మణికంఠ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఈయన స్వగ్రామం శ్రీకాకుళం మండలం బలివాడ గ్రామం. తండ్రి కృష్ణారావు చిరు వ్యాపారి. రాయలసీమ జోన్‌కు ఎంపికైనట్లు మణికంఠ విలేకరులకు తెలిపారు.

వ్యవసాయ కూలీ ఇంట..



నీలవేణి

ఎల్.ఎన్.పేట: మండలంలోని పెద్దకోట గ్రామానికి చెందిన బమ్మిడి నీలవేణి ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించారు. నీలవేణి తల్లిదండ్రులు బమ్మిడి సింహాచలం, కొండమ్మలు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. వీరి ముగ్గురు పిల్లల్లో పెద్ద కుమార్తె నీలవేణి మొదటిసారి పోటీ పడి జోన్–1లో ఎస్‌ఐ ఉద్యోగాన్ని సాధించారు. ఆమె ప్రాథమిక విద్య ఎంపీపీ స్కూల్ పెద్దకోట, ఉన్నత విద్య జెడ్పీ ఉన్నత పాఠశాల లక్ష్మీనర్సుపేట, ఇంటర్ విద్య ప్రభుత్వ జూనియర్ కాలేజీ లక్ష్మీనర్సుపేట, డిగ్రీ హిరమండలం గాయత్రి కాలేజీలో చదువుకున్నారు. కోచింగ్ తీసుకుంటూ ఎస్‌ఐ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యానని నీలవేణి తెలిపారు. మొదటి సారి పోటీ పరీక్షలోనే ఉద్యోగం సాధించానని అన్నారు. నీలవేణి ఎస్‌ఐ ఉద్యోగం సాధించటంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేద కుటుంబం నుంచి వచ్చి..



కార్తీక్

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం పంచాయతీ టి.గంగువాడ గ్రామానికి చెందిన చిత్త కార్తీక్ ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. పరీక్ష ఫలితాల్లో 236 మార్కులతో 279వ ర్యాంకు సాధించి, సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. కార్తీక్ తల్లిదండ్రులు చంద్రశేఖర్, లక్ష్మి దంపతులు పేద కుటుంబానికి చెందినవారు. తమ కుమారుడు ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్తీక్‌కు స్థానికులు గురువారం అభినందనలు తెలిపారు.

కానిస్టేబుల్ టు ఎస్‌ఐ



భాస్కరరావు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం గ్రామానికి చెందిన వావిలపల్లి భాస్కరరావు 2018లో ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్‌గా ఎంపికై విధులు నిర్వహిస్తున్నాడు. అప్పటి నుంచి ఎస్‌ఐ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ చదువుతున్నాడు. ఎస్‌ఐ ఫలితాల్లో ఏపీఎస్పీ ఓపెన్ కేటగిరీలో 17 ర్యాంకు సాధించి ఏపీఎస్పీ ఎస్‌ఐగా ఎంపికయ్యాడు. 229 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు వరహాలు, మణిలది వ్యవసాయ నేపథ్యం.

ప్రతిభకు వేదిక

- జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన పోటీలు రేపు
- మండల స్థాయిలో ఎంపికైన ప్రాజెక్టులకు మాత్రమే ప్రవేశం
- విజయవంతం చేయాలని డీఈఓ పిలుపు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన పోటీలు ఈనెల 23వ తేదీన జరగనున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ తరఫున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. శ్రీకాకుళం రూరల్ పరిధిలోని మునసబుపేటలో ఉన్న గురజాడ విద్యాసంస్థలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ఈ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలు మొదలవుతాయని చెప్పారు. మండల స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో విజేతలుగా నిలిచిన ప్రాజెక్టులను మాత్రమే జిల్లా స్థాయి పోటీలకు అర్హులుగా పరిగణిస్తామని డీఈఓ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రాజెక్టుల ప్రదర్శనలకు అవసరమైన సామగ్రి, వస్తువులను వెంట తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వ్యక్తిగత ప్రాజెక్టులు, గ్రూప్ ప్రాజెక్టులు, ఉపాధ్యాయ ప్రాజెక్టుల వారు విధిగా హాజరుకావాల్సి ఉంటుందని సూచించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు హాజరవుతారని డీఈఓ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎస్.కుమారస్వామి (9490037182) ని సంప్రదించాలని ఆయన కోరారు.

గణిత మేధావికి ఘన నివాళి



ముత్యాలపేట విద్యార్థుల రంగవల్లిక



బీఆర్‌ఏయూలో..

కవిటి : భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ గణిత సమాజానికి చేసిన సేవలు నిరుపమానమైనవని విద్యార్థులు నినదించారు. మండలంలోని ముత్యాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ కనిపెట్టిన మ్యాజిక్ నెంబర్ 1729 ఆకృతిలో కూర్చున్నారు. అనంతరం పిరమిడ్, రాంబస్, చతురస్రం, దీర్ఘచతురస్రం, స్థూపము తదితర గణిత ఆకృతులకు చెందిన రంగవల్లికలను ఆకర్షణీయంగా రంగులు దిద్ది అలంకరించారు.

బీఆర్‌ఏయూలో..

శ్రీనివాస రామానుజన్‌కు బీఆర్‌ఏయూ విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుందరమైన రంగవల్లికలను తీర్చిదిద్దారు.

ట్యాబ్‌ల పండగ

- జిల్లావ్యాప్తంగా ట్యాబ్‌ల పంపిణీతో సందడి
- ప్రభుత్వ బడులకు మరింత చేరువైన సాంకేతిక విద్య



శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పంపిణీ చేసిన ట్యాబ్‌లతో హెచ్‌ఎం ఎం.వాగ్దేవి, పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌ల పండగ వచ్చింది. వరుసగా రెండో ఏడాది ప్రభుత్వ బడుల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం గురువారం ఘనంగా మొదలైంది. ప్రభుత్వ బడుల్లో సాంకేతిక విద్యను మరింత చేరువ చేసే విధంగా గత ఏడాది బైజూస్‌తో ఒప్పందం చేసుకుని కోట్లాది రూపాయలను వెచ్చించి రాష్ట్రప్రభుత్వం ట్యాబ్‌లను అందించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వరుసగా రెండో ఏడాది కూడా ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 8వ తరగతి బాలబాలికలకు అపురూపమైన కానుకను ఇచ్చారు. దీంతో జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు, సభ్యుల చేతుల మీదుగా ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో మొదలైంది. ఈ ప్రక్రియ ఈనెలాఖరు వరకు కొనసాగనుంది.

జిల్లాలో 22,318 మందికి ట్యాబులు..

పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో 625 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఉండగా వీటిల్లో 22,318 మంది విద్యార్థులు 8వ తరగతి చదువుతున్నారు. వీరంతా ట్యాబ్‌లను అందుకోనున్నారు. అయితే తొలి విడతగా వివిధ సాఫ్ట్‌వేర్‌లు, యాప్‌లతో ఇన్‌స్టలేషన్ చేసిన 10050 ట్యాబ్‌లను జిల్లాకు చేర్చా రు. వీటిని కొన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. మిగిలిన ట్యాబులు రెండు మూడు రోజుల్లో జిల్లాకు చేరుకోనుండగా.. వీటిని కూడా మండల కేంద్రాలకు చే ర్చి.. అక్కడ నుంచి పాఠశాలలకు అందించి.. విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో గత ఏడాది 8వ తరగతి చదివిన 22982 మంది విద్యార్థులకు, 2971 మంది ఉపాధ్యాయులకు కలిపి 25,953 ట్యాబ్‌లను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. వీరంతా ఇప్పుడు 9వ తరగతి విద్యను అభ్యసిస్తున్నారు.

ఉద్యోగ, ఉపాధి నైపుణ్యకోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

కాశీబుగ్గ: పలాసలో డాక్టర్ కణితి ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వల్ప కాలిక కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ పైల జవహర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉద్యోగ, ఉపాధి నైపుణ్య కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అసిస్టెంట్ సర్వేయర్ కోర్స్‌ను ప్రారంభిస్తున్నామని టెన్త్ ఉత్తీర్ణత, ఆపైన పాసైన విద్యార్హత కలిగి 18–28 ఏళ్ల లోపు వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు ఫొటో, ఆధార్ జిరాక్స్ సెట్లతో హాజరు కావాలని, వివరాల కోసం6301046329కు సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

అథ్లెటిక్స్, వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరపున హాజరయ్యే అథ్లెటిక్స్, వాలీబాల్ క్రీడాకారుల ఎంపికలు శుక్రవారం నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ డీన్ ప్రొఫెసర్ పి.సుజాత తెలిపారు. వర్సిటీలో గురువారం ఆమె మాట్లాడుతూ మహిళలు, పురుషులు అథ్లెట్ క్రీడాకారుల ఎంపిక శ్రీకాకుళం పట్టణంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో శుక్రవారం 10 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. వాలీబాల్ ఎంపికలు బీఆర్ఏయూలో మధ్యాహ్నం 1.30 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు వినోద్


వినోద్

నరసన్నపేట: జాతీయ స్థాయిలో రాజస్థాన్‌లోని బైకరాన్‌లో నిర్వహించే అండర్–19 స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు నరసన్నపేట ఇంటర్ విద్యార్థి కింజరాపు వినోద్ ఎంపికయ్యాడు. ఈ నెల 25 నుంచి 28 వరకూ జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. దీంట్లో స్థానిక వీర హనుమాన్ వ్యాయామ శాలలో శిక్షణ పొందుతున్న వినోద్ 61 కేజీల విభాగంలో పాల్గొంటున్నట్లు కోచ్ అప్పలరామయ్య తెలిపారు. శుక్రవారం పయనం అవుతున్నట్లు తెలిపారు.

హేమమాలినీ రెడ్డి పదవీ కాలం పెంపు


హేమమాలినీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: స్టేట్ కోఆపరేటివ్ ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఎచ్చెర్ల జెడ్పీటీసీ సభ్యురాలు, మాజీ ఎంపీపీ బల్లాడ హేమమాలినీ రెడ్డి పదవీ కాలం పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు వెలువరించింది. 2021 ఆగస్టు 25 నియమితులైన ఈమె పదవీ కాలం 2023 ఆగస్టు 24వ తేదీకి పూర్తయ్యింది. మరో రెండేళ్లు పదవీ కాలం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె భర్త బల్లాడ జనార్దన రెడ్డి మాజీ ఎంపీపీకాగా, ప్రస్తుతం కుప్పిలి ఎంపీటీసీ సభ్యునిగా కొనసాగుతున్నారు.

మర్చిపోయిన ల్యాప్‌టాప్ అందజేత


జీఆర్పీ పోలీసుల నుంచి ల్యాప్‌టాప్ అందుకుంటున్న మారియా డానియల్

కాశీబుగ్గ: తమిళనాడు కుమ్మంగులంకు చెందిన మారియా డానియల్ ఇక్కడ మర్చిపోయిన రూ.80 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను పలాస జీఆర్పీ పోలీసులు గురువారం అందించారు. గుణుపూర్–పూరి రైలులో మిత్రులతో కలిసి ప్రయాణం చేస్తూ మర్చిపోవడంతో జీఆర్పీ పోలీసులు ట్రేస్ చేసి అందించారు. కార్యక్రమంలో క్రైం సిబ్బంది హెచ్‌సీ కోదండరావు, పీసీలు శ్రీనివాసరావు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


శాంతాక్లాజ్ అలంకరణ



లూథరన్ చర్చిలో మహిళ క్రిస్మస్ వేడుకలు

● క్రిస్మస్ సందడి

మార్కెట్‌లో క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. చర్చిలు, ఇళ్ల అలంకరణలో క్రైస్తవులు బిజీబిజీగా గడుపుతున్నారు. మరోవైపు క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ డ్రస్సులు, నక్షత్రాలు, బాల్స్, క్రీస్తు జననం బొమ్మలు మార్కెట్‌లో సిద్ధమయ్యాయి. వీటి ధరలు రూ.30 నుంచి రూ.10వేల వరకు ఉన్నాయి. నక్షత్రాలు రూ.30 నుంచి రూ.3వేలు వరకు పలుకుతున్నాయి. – శ్రీకాకుళం కల్చరల్


పూరిపాకలో క్రీస్తు జననం


షాపుల వద్ద అలంకరణ సామగ్రి


క్రిస్మస్ ట్రీ


ప్రత్యేక బండిలో చిన్నారి శాంతాల సందడి

ఘనంగా మహిళా క్రిస్మస్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని స్టేడియం వద్ద గల సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో గురువారం మహిళా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాస్టర్ టి.రాజ్‌కిరణ్ ఆధ్వర్యంలో మహిళలంతా క్రైస్తవ గీతాలను ఆలపించారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు.

'గుర్తుండే పనులేమైనా చేశారా..?'



సంతబొమ్మాళి: పద్నాలుగేళ్లు పాలించిన చంద్రబాబు నాయుడు జిల్లాకు గుర్తుండిపోయే అభివృద్ధి పనులేమైనా చేశారా అని టీడీపీ నాయకులను కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి సూటిగా ప్రశ్నించారు. హెచ్ఎన్‌పేట వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రలో తాను ప్రతి గ్రామంలోనూ తిరిగానని, సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి ఏమీ చేయలేదని లోకేష్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన తండ్రి హయాంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని అన్నారు. రాష్ట్రంతో పాటు జిల్లా అభివృద్ధిలో సీఎం వైఎస్ జగన్ పాత్ర చాలా కీలకమైనదని అన్నారు. మూలపేట పోర్టుతో ఉత్తరాంధ్ర కల నెరవేరిందని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా వేధిస్తున్న కిడ్నీ వ్యాధులను తరిమివేయడానికి సురక్షిత మంచినీటి పథకంతో పాటు ఆస్పత్రిని కూడా నిర్మించా రని తెలిపారు. వంశధారతో రైతులకు సాగునీరు, తాగునీరు అందుతోందన్నారు. రూ. 850 కోట్లతో ఆఫ్‌షోర్ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. టీడీ పీ హయాంలో బీసీలను చాలా చులకన చేసి మా ట్లాడారని గుర్తుచేశారు. లోకేష్ వల్లే పార్టీ సర్వనాశనం అవుతోందని మాట్లాడిన అచ్చెన్నాయుడు మళ్లీ లోకేష్ నాయకత్వం వరిల్లాలని అనడం దేనికి సంకేతమన్నారు. రానున్న ఎన్నికల్లో టెక్కల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తామని చెప్పారు. ఆమెతో పాటు జెడ్పీటీసీ పాల వసంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.రాజశేఖర్, నక్క భీమారావు, పి.రామకృష్ణ, జె.బాబురావులు ఉన్నారు.

నేడు బొడ్డపాడులో సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి సభ


అమరవీరుల స్మారక మందిరం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న విప్లవ సంఘాల నాయకులు

పలాస: పలాస మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాట యోధుడు, విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 54వ వర్ధంతి సభను నిర్వహిస్తున్నట్టు అరుణోదయ సాంస్కృతి సమాఖ్య జిల్లా మార్పు మల్లేశ్వరరావు, ప్రజాకళామండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవి చెప్పారు. ఈ మేరకు బొడ్డపాడు అమ రుల స్మారక మందిరం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండు కళాసంస్థల ఆధ్వర్యంలో కళాకారులు పాణిగ్రాహి స్మృతి పథంలో తమ ఆటా పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే ముందుగా అరుణ పతాకాన్ని పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రాహి ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభలో విరసం రాష్ట్ర నాయకులు పాణి, పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీ, అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ప్రజాకళామండలి రాష్ట్ర సహాయకార్యదర్శి కె.నీలకంఠం, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు తాండ్ర ప్రకాష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో గొరకల బాలకృష్ణ, పి.కుసుమ, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, మాధవరావు, సార జగన్, బల్ల గోపి, అప్పయ్య, క్రిష్ణవేణి, నీలంరాజు, బి.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: సంతబొమ్మాళిలో ఇటీవల జరిగిన బంగారం చోరీ కేసుకు సంబంధించి అదే గ్రామానికి చెందిన జలుమూరు అప్పన్న అనే వ్యక్తిని గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు సంతబొమ్మాళి ఎస్ఐ మధుసూదన రావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 19వ తేదీన సంతబొమ్మాళి గ్రామానికి చెందిన తలగాపు జోగమ్మ అనే మహిళ ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు అందింది. అనుమానిత వ్యక్తి గురించి సమాచారం అందడంతో పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ మేరకు గురువారం స్థానిక పాతబస్టాండ్ వద్ద ఆ వ్యక్తిని అదుపులో తీసుకుని విచారించగా తానే చోరీకి పాల్పడినట్లు అంగికరించాడని, అతని వద్ద నుంచి 8.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అనంతరం ముద్దాయిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

'26 నాటికి క్లెయిములు పరిష్కరిస్తాం'


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఇతర సవరణల కోసం వచ్చిన క్లెయిములను ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తిగా పరిష్కరిస్తామని, అనంతరం తుది ఓటర్ల జాబితా జనవరి 5న వెలువడనుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు చెప్పారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో 23వ వారపు సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అంశాల వారీగా సమీక్షించారు. దాదాపు అన్ని క్లెయిములు పూర్తయ్యాయని, కేవలం ఒకటి రెండు శాతం దరఖాస్తులను మాత్రమే పరిష్కరించాల్సి ఉందని వివరించారు. ఇంకా అర్హత ఉన్న వారు ఓటు హక్కు పొందేందుకు ఫారం 6 ను నేరుగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఇప్పుడు కూడా ఇవ్వవచ్చునని, ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వాటిని పరిశీలించి, సాధారణ ఎన్నికల నామినేషన్లకు పది రోజుల ముందు ప్రచురించే అనుబంధ (సప్లిమెంట్) జాబితాలో చేర్చడం జరుగుతుందని అన్నారు. సమావేశానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రొౌతు శంకర రావు, టీడీపీ నాయకులు రామరాజు, సి సెక్షన్ సూపరింటెండెంట్ బి.ప్రకాశరావు తదితరులు హాజరయ్యారు.

చిన్నారి కిడ్నాప్ కథ సుఖాంతం

- తల్లి వద్దకు చేరిన పాప
- కిడ్నాపర్లను అరెస్టు చేసిన పోలీసులు


మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి కిడ్నాప్ ఉదంతం సుఖాంతమైంది. చిన్నారిని బుధవారం ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఎత్తుకుపోయినట్లు పాప తల్లి నాగమణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్ బృందం పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి కిడ్నాప్ చేసిన వ్యక్తులను పట్టుకోవడానికి ముమ్మరంగా గాలించారు. పాతపట్నం మండలం ఏఎస్ కవిటి గ్రామం వద్ద వారిని గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా కాశీనగర్ గ్రామానికి చెందిన చల్లా శంకరరావు పాతపట్నం మండలం రేణుగూడ గ్రామానికి చెందిన సవర కృష్ణారావు ఇద్దరూ కలసి చిన్నారిని కిడ్నాప్ చేశారు. రేణుగూడ గ్రామంలో కృష్ణారావు ఇంటి వద్ద చిన్నారిని బుధవారం రాత్రి ఉంచారు. గురువారం ఉదయం చిన్నారిని, శంకరరావును వేరే చోటికి పంపే క్రమంలో సవర సవర కృష్ణారావు ద్విచక్రవాహనంలో ఒడిశా పర్లాఖిమిడి వైపు వెళ్తుండగా.. పోలీసు సిబ్బందితో కలసి ఎస్ఐ పట్టుకున్నారు. చిన్నారిని తల్లికి అప్పగించారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

'అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తున్నాం'

శ్రీకాకుళం క్రైమ్ : అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వెళ్తోందని జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి బి.శాంతిశ్రీ పేర్కొన్నారు. ఆమె గురువారం రాత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు మేలు కలిగేలా జీఓలు విడుదల చేయడంతో జిల్లాలోని 3358 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 6040 (2734 కార్యకర్తలు, 2714 ఆయాలు, 592 మంది మినీ) మందికి లబ్ధి కలుగుతోందని వివరించారు. కొద్ది రోజులుగా సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీ వర్కర్స్ ఒక్కక్కరుగా విధుల్లో చేరుతున్నారని, మిగతా వారు కూడా వచ్చి చేరుతారని పీడీ చెప్పారు.

అన్నకు తలకొరివి పెట్టిన చెల్లెలు


తలకొరివి పెడుతున్న సున్నీశెట్టి

ఇచ్ఛాపురం రూరల్: తండ్రికి తలకొరివి పెట్టాల్సిన బిడ్డలు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో వరుసకు చెల్లి అయ్యే మహిళ ఆ బాధ్యతను నెత్తికెత్తుకుంది. కీర్తిపురం గ్రామానికి చెందిన బిమ్మోశెట్టి(50) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందారు. కొడుకు గిరి శెట్టి బెంగళూర్‌లో ఉన్నారు. బిమ్మో శెట్టికి భార్య, కుమార్తె ఉన్నప్పటికీ ఒడియా సంప్రదాయం ప్రకారం తలకొరివి పెట్టేందుకు వీలు కాకపోవడంతో బావమరిది భార్య సున్నీశెట్టి తలకొరివి పెట్టేందుకు ముందుకువచ్చారు. ఆమె గురువారం ఉదయం నిర్వహించిన దహన సంస్కారాల్లో పాల్గొన్నారు.

'విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి'


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

సరుబుజ్జిలి: విద్యా ప్రమాణాల మెరుగు కోసం అధ్యాపకులంతా కృషి చేయాలని డీఈఓ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. బూర్జ మండలంలోని ఓవిపేట మోడల్ స్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, బాలికల హాస్టల్, వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు చక్కటి రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఈ సమయంలో 9, 10 తరగతుల విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసరావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సంబంధం లేదంటూనే..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ఆ శాఖకు సంబంధం లేదంటూనే బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారి సంతకాలు లేకుండా ఖాతాలున్న బ్రాంచి మేనేజర్లకు మళ్లింపు చేస్తున్నట్లు తెలుస్తోంది. మ్యూచువల్ ఫండ్స్‌కు సంబంధించి ఓ వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు వస్తున్న ఆరోపణల్లో తమకు వాస్తవాలేమిటో తెలియవని, అతనికి తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని.. సంబంధిత మ్యూచ్‌వల్ ఫండ్స్ బ్యాంకునే సంప్రదించాలని ఉన్నతాధికారి చెప్పడం విశేషం. ఇదే విషయం సంబంధిత మ్యూచ్‌వల్ ఫండ్స్ బ్యాంకుకు వెళ్తే అక్కడ డిప్యుటేషన్‌పై ఉన్న అధికారి తమకేమీ తెలియవని, అంతా ముంబై హెడ్ ఆఫీసుకే మాట్లాడుకోవాలని, లేదంటే వెబ్‌సైట్‌లో నంబరును పరిశీలించుకోవాలంటున్నారు. బాధితులు సంస్థను నమ్మే ఇచ్చామని, అందులో విడివిడిగా విభాగాలుండి తమకు సంబంధం లేదంటే ఎలా అంటున్నారు.

ముగిసిన ప్రజా చైతన్య యాత్ర


విజయ స్థూపం వద్ద కావూరి జయకుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో సారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుముడి గ్రామానికి చెందిన కావూరి జయకుమార్ చేపట్టిన 101 రోజుల ప్రజా చైతన్య యాత్ర గురువారం లొద్దపుట్టిలో ముగిసింది. ఈ సందర్భంగా విజయ సంకల్పయాత్ర విజయ స్థూపం వద్ద జయకుమార్‌ను ఎమ్మెల్సీ నర్తు రామారావు, సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎన్.బాబూరావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, పీఏసీఎస్ చైర్మన్ నర్తు నరేంద్ర, వైస్ ఎంపీపీలు దువ్వు వివేకానందరెడ్డి, దున్న గురుమూర్తి, చాట్ల తులసీదాసురెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. సీఎం జగనన్న జన్మదినం సందర్భంగా ఆయన పైలాన్ వద్ద మొక్కలు నాటారు.

పల్లెల్లో ఎర్రచందనం చెట్ల దొంగలు


కట్ చేయగా ఆనవాలుగా మిగిలిన ఎర్రచందనం చెట్టు మొదలు

ఎల్.ఎన్.పేట: ఎర్ర చందనం చెట్ల దొంగలు విజృంభిస్తున్నారు. వారం రోజుల్లో ఐదు ఎర్రచందనం చెట్లు మాయం చేశారు. మండలంలోని కోవిలాం గ్రామంలో రైతులు పొలం గట్లు, కళ్లాల్లో వేసుకున్న ఎర్రచందనం చెట్లు దొంగల పాలవుతున్నాయి. కోవిలాం గ్రామానికి చెందిన రైతులు నడిపల్లి సరస్వతి, కెల్ల అప్పారావు, కెల్ల ఆనందరావులకు చెందిన ఐదు ఎర్ర చందనం చెట్లు వారం రోజుల వ్యవధిలో దొంగలు కట్ చేసి తీసుకుని వెళ్లిపోయారు. గ్రామస్తుల సహకారంతోనే ఎర్రచందనం దొంగలు చెలరేగిపోతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగులకు పీఆర్‌టీయూ సంఘీభావం

శ్రీకాకుళం న్యూకాలనీ: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వెంటనే చొరవ తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగి మురళీమోహనరావు, దానేటి కేశవరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం వారు కలెక్టరేట్ సమీపంలో మహాత్మా జ్యోతిబాపూలే ప్రాంగణం ఎదురుగా చేపడుతున్న నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపారు. వెంటనే ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు వారితో సంప్రదింపులు జరిపి సమ్మె విరమణకు కృషి చేయాలని, వారికి మేలు చేసే నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు వసంత రాజారావు, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మందసలో బ్రహ్మజ్ఞాన తరగతులు

మందస: మందస పట్టణంలోని శ్రీజగన్నాథస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మజ్ఞాన తరగతులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 6 నుంచి 7గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు శ్రీభగవాన్ శ్రీనివాసయోగిస్వామీజీ తరగతులను బోధిస్తారన్నారు. ఆధ్యాత్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.